# భూభారతి ఆపరేటర్ల వేతన వెతలు!

- ఏడాదిన్నరగా జీతాలు లేక భూ భారతి ఆపరేటర్ల పస్తులు
- మెదక్ జిల్లాలో 20 మంది ఆపరేటర్లు
- రూ.40 లక్షలకు పైగా బకాయిలు
- ఆపరేటర్ల వెట్టి చాకిరీ



కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న భూ భారతి ఆపరేటర్లు(ఫైల్)

మెదక్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తహసీల్ కార్యాలయా ల్లో పనిచేస్తున్న భూ భారతి ఆపరేటర్లకు 15 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి కుటుంబాలు ఆర్థికంగా దీనస్థితిలో ఉన్నాయి. భూ భారతి ఆపరేటర్లు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ రికార్డుల నమోదు తదితర సేవలు అందిస్తున్నారు. ఓ ఏజెన్సీ ద్వారా నియామకమైన నాటి నుంచి వస్తున్న అరకొర జీతాలతో వీరి జీవితాలు ఆగమ్యగోచరంగానే సాగుతున్నాయి. ప్రభుత్వ జీవోలకు అనుగుణంగా వేతనం చెల్లించేలా చూడాలని, పీఎఫ్, ఈ ఎస్ఐ వర్తింపజేయాలని, ప్రధానంగా ఉద్యోగ భద్రత కల్పించాలని, ఏజెన్సీల ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా జీతాలు ఇచ్చేలా చూడాలని వారు కోరుతున్నారు. జిల్లాలో 20 మంది భూ భారతి ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ రికార్డుల నమోదు, రైతుల వేలిముద్రల సేకరణ, సైట్‌లో వివరాలు పొందుపర్చడం తదితర సేవలు అందిస్తున్నారు. 2018లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ (ఎఫ్టీఎస్) పేరిట ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఆపరేటర్లను నియమించింది.

### ఆపరేటర్ల వెట్టి చాకిరీ

కేవలం ఆపరేటర్ విధులే కాకుండా, తహసీల్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు, ఎన్నికల సర్వే, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రా లు, ఇతరత్రా డేటా ఎంట్రీ కూడా వారితోనే చేయిస్తున్నారు. వేతనం తక్కువగా ఉన్నా, వారు రకరకాల పనుల కారణంగా వెట్టి చాకిరీకి గురవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహించడమేకాక, అవసరమైతే రాత్రి వరకు కూడా పనిచేయాల్సి వస్తోంది. మండలానికి ఒక్క ఆపరేటరే ఉండడంతో అత్యవసరం ఉన్నప్పుడో, అనారోగ్యానికి గురైనప్పుడో సెలవు పెట్టాల్సి వస్తే ప్రత్యామ్నాయం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఒక మండలం ఆపరేటర్ సెలవు పెడితే పక్క మండలం ఆపరేటర్‌తో విధులు నిర్వర్తింపజేయాలని అధికారులు సూచిస్తున్నారు.

### రూ.40 లక్షలకు పైగా బకాయిలు

ఒక్కో ఆపరేటర్‌కు నెలకు రూ.11,500 చొప్పున 15 నెలల వేతనాలు రావాల్సి ఉంది. ఒక్కో ఆపరేటర్‌కు రూ.1.72 లక్షల వేతన బకాయిలు ఉన్నాయి. మొత్తంగా 20 మంది ఆపరేటర్లకు సుమారు రూ.40 లక్షలపై చిలుకు బకాయిలు ఉన్నాయి. సమాన పనికి సమాన వేతనం చెల్లించడంతో పాటు ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆపరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి నెలా వేతనాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించినందున ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వారు కోరుతున్నారు. బీటెక్, ఎంటెక్, నిర్ణీత సాఫ్ట్ వేర్, కంప్యూటర్ రంగంలో అనుభవం ఉన్న తమను రెగ్యులర్ చేయాలని ఆపరేటర్లు కోరుతున్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. 2018 మే నుంచి 2021 జూలై వరకు ఒక్కొక్కరికి నెలకు వేతనం 9,980 రూపాయలు చెల్లించారు. 2021 జూన్ నుంచి నెలకు రూ. 11,583 జీతం చెల్లిస్తున్నారు. 2021లో జారీ అయిన జీవో నంబరు 63 ప్రకారం భూ భారతి కంప్యూటర్ ఆపరేటర్లకు నెలకు రూ.31,040 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### నెలనెలా ఇబ్బందులే..

ధరణి ఆపరేటర్లకు పదిహేను నెలలుగా వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. గతంలో రెండు, మూడు నెలలకోసారి వేతనాలు అందాయి. ఫిబ్రవరి 2024 వరకు మాత్రమే వేతనాలు అందాయి. వేతనాల కోసం జిల్లా కార్యాలయాల్లో, సీసీఎల్ ఏలో, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలను అందిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. భూ రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయం తీసుకువచ్చే భూ భారతిలో భాగస్వామ్యమైన తమకు ప్రతినెలా వేతనాలు అందేలా ప్రభుత్వం స్పందించాలని వారు కోరుతున్నారు.

### ప్రతినెలావేతనాలు అందేలా చూడాలి



భూ భారతి ఆపరేటర్లకు ప్రతి నెలా వేతనం అందించేలా చూడాలి. 15 నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారింది. భూ భారతి ఆపరేటర్లుగా నియమితులైన వారిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్ పట్టభద్రులే ఉన్నారు. కుటుంబ పోషణ కోసం అప్పులు తీసుకువచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికే మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్లను కలిసి వినతి పత్రాలు కూడా సమర్పించాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించాలి. **-కర్రె ఆశయ్య, భూ భారతి ఆపరేటర్**

### ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలి



తహసీల్, ఇతర రెవెన్యూ కార్యాలయాల్లో పనిచేస్తున్న భూ భారతి ఆపరేటర్లను రెగ్యులర్ చేయాలి. భూ భారతి పోర్టల్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి జీవో నం.63 ప్రకారం కనీస వేతనంగా నెలకు రూ.31,040 అందజేయాలి. మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. విధి నిర్వహణలో ఉండగా చనిపోయిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. ప్రభుత్వం స్పందించి ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రెజరీల ద్వారా వేతనాలు చెల్లించాలి.

**- మంద ప్రసాద్, భూ భారతి ఆపరేటర్**

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయరూ..



పూరిగుడిసె ఎదుట పున్న కిషన్

రామాయంపేట, జూన్ 14: తాను 40 ఏండ్లుగా పూరి గుడిసెలోనే ఉంటున్నా.. తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని పున్న కిషన్ వేడుకుంటున్నాడు. మండలంలోని డీ.ధర్మారం గ్రామంలో మజీద్ గడ్డ వద్ద 40 ఏండ్లుగా పూరి గుడిసెలోనే జీవనం కొనసాగిస్తున్నాడు. ఇల్లు ఉన్నవారికే ఇండ్లను మంజూరు చేస్తున్నారు. తనలాంటి వాడికి ఎందుకు మంజూరు చేయరని కనిపించిన వారికి గోడు వెల్లబోసుకుంటున్నాడు పున్న కిషన్. ఇప్పటికైనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ఇల్లు మంజూరయ్యేలా చూడాలని కోరుతున్నాడు.

## సర్కారు బడికి అంగన్‌వాడీ విద్యార్థులు



చిన్నారులను అక్కున చేర్చుకున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

రామాయంపేట, జూన్ 14: డి.ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శనివారం సాదరంగా స్వాగతం పలికారు. వారికి అడ్మిషన్లు ఇచ్చారు. ముందుగా సరస్వతీ మాతకు పూజ చేసి, చిన్నారులను హెచ్‌ఎం నాగేందర్‌కు అప్పగించారు. హెచ్‌ఎం చిన్నారులకు పూలు, పండ్లు, బిస్కెట్లు ఇచ్చి ఎత్తుకుని పాఠశాలలోకి ఆహ్వానించి, పేర్లు నమోదు చేసుకున్నారు. జయపాల్‌రెడ్డి, రాజేశ్వర శర్మ, సిద్ధిరాములు తదితరులు ఉన్నారు.

## పట్టణ శుభ్రతకు సహకరించాలి

**- సీడీఎమ్‌ఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయికుమార్**




ర్యాలీలో పాల్గొన్న సీడీఎమ్‌ఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయికుమార్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 14: పట్టణ శుభ్రతకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీడీఎమ్‌ఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయికుమార్ అన్నారు. మున్సిపాలిటీల్లో వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా శనివారం మెదక్‌లో పర్యటించారు. 22వ వార్డులో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బందితో కలిసి చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. వార్డు ప్రజలకు తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈ మహేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

## చెక్‌డ్యాం కూలిపోవడంతో వృథాగా నీరు



చిన్నశంకరంపేట, జూన్14: గతేడాది కురిసిన వానకు వరదలు ఎక్కువగా రావడంతో మండలంలోని జంగరాయి శివారులో మంచిగుట్ట వద్ద ఉన్న చెక్‌డ్యాం పాక్షికంగా కొట్టుకుపోయింది. రెండు రోజుల క్రితం కురిసిన వానలకు కాల్వలోకి నీళ్లు భారీగా రావడంతో, చెక్‌డ్యాం సరిగ్గా లేక నీళ్లు వృథాగా పోతున్నాయి. చెక్‌డ్యాంను నిర్మించి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఆయకట్టు ద్వారా 50 ఎకరాల పొలాలకు నీళ్లు అందుతాయని, అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## ఏడేండ్లకు పరిష్కారమైన కేసు




లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హేమలత

నర్సాపూర్, జూన్14: నర్సాపూర్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఏడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసును పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి హేమలత తెలిపారు. శనివారం నర్సాపూర్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేశారు. జడ్జి హేమలత మాట్లాడుతూ బాధితుడు తలారి విఠల్, నిందితులు కంచనపల్లి పోచమ్మ ఇరువురి మధ్య రాజీ కుదుర్చుకున్నారన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు తగాదా పడి పరస్పరం కేసులు నమోదు చేయించుకున్నారు. కోర్టు చుట్టూ తిరుగుతూ తమ సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. దీంతో ఇరు వర్గాలు జాతీయ లోక్‌అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకున్నారు. పీపీ రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్‌గౌడ్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం పాల్గొన్నారు.

## 55సార్లు రక్తదానం చేసిన రాజశేఖర్‌రెడ్డి



రాజశేఖర్‌రెడ్డికి రాజ్‌భవన్‌లో ప్రశంసా పత్రం అందజేస్తున్న గవర్నర్

రామాయంపేట, జూన్ 14: రక్తదానం ప్రాణదానంతో సమానమని మెదక్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గవర్నర్, రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు జిష్ణుదేవ్ వర్మ ప్రా రంభించిన రక్తదాన శిబిరంలో రాజశేఖర్‌రెడ్డి రక్తదానం చేశారు. దీంతో ఆయన 55 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆయనను అభినందించి, ప్రశంసా పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

## రిజర్వేషన్ల తరువాతే ఎన్నికలు నిర్వహించాలి

- తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు యాదగిరి
- 17న మెదక్‌లో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం



విలేకరులతో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 14: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకుడు కొత్తల యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం ఆయన జాగృతి నాయకులు విజయేందర్, కుమారస్వామి, నర్సింలు, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, కృష్ణ, గోపాలకృష్ణ తదితరులతో కలిసి విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఒక మాట, తరువాత ఒక మాట మాట్లాడుతూ బీసీలను మోసం చేస్తున్నదన్నారు. కులగణన చేపట్టి దేశాన్ని ఎక్స్‌రే తీస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మాట ఏమైందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### మెదక్‌లో ఉమ్మడి జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం

ఈనెల 17న మెదక్‌లోని హెచ్ కన్వెన్షన్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బీసీ నేతలతో ఉమ్మడి మెదక్ జిల్లా రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు యాదగిరి పేర్కొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట కవిత ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఉమ్మడి మెదక్ జిల్లాలోని బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## కొన్ని కేసుల్లో రాజీయే రాచమార్గం



అవార్డు పత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

మెదక్ అర్బన్, జూన్14: కొన్ని కేసుల్లో రాజీయే రాచమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానముల సముదాయంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని కోర్టుల్లో లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 6039 అన్ని రకాల కేసులు పరిష్కరించినట్లు ఆమె పేర్కొన్నారు. మొత్తం కేసుల్లో రూ.55,90,281 రికవరీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శుభవల్లి, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సిరిసౌజన్య, స్పెషల్ మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ సాయి ప్రభాకర్, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో పలువురు జూదగాళ్లు



పోలీసులు పట్టుకున్న పేకాటరాయుళ్లు

పాపన్నపేట,జూన్ 14ః మండల పరిధి నాగ్సాన్‌పల్లి శివారులో జూదం ఆడుతున్న పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.నాగ్సాన్‌పల్లి శివారులో పలువురు వ్యక్తులు జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు,స్థానిక పోలీసులు రైడ్ చేయగా జూదం ఆడుతున్న 13మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ,14,330 నగదు, 3ఫోన్లు స్వాదీనం చేసుకొని ఠాణాకు తరలించినట్లు చెప్పారు.సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌రాజారెడ్డి,కానిస్టేబుళ్లు,తదిరులు ఉన్నారు.

## చిన్నపాటి వాన కురిసినా కరెంట్ కట్

చిన్నశంకరంపేట, జూన్14: చిన్నపాటి వాన కురిసినా ఆ రాత్రంతా గిరిజన తండా అంధకారంలో ఉండాల్సిందే. ఉదయం అయ్యే వరకు విద్యుత్ కోసం వేచి చూడాల్సిందే. చిన్నశంకరంపేట మండల ఖాజాపూర్ తండాకు రామాయంపేట మండలం ఝాన్సీ లింగాపూర్‌లోని విద్యుత్ ఉపకేంద్రం నుంచి కరెంట్ సరఫరా అవుతున్నది. చిన్న వర్షం కురిసినా తండాకు అధికారులు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఏటా వానకాలంలో విద్యుత్ కోసం ఇబ్బందులు పడకతప్పడం లేదని తండా వాసులు వాపోతున్నారు. పక్కనే ఉన్న శాలిపేట విద్యుత్ ఉపకేంద్రం నుంచి కరెంట్‌ను సరఫరా చేయాలని జిల్లా మండలస్థాయి విద్యుత్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తండావాసులు చెబుతున్నారు. విద్యుత్ ఏఈ దినాకర్‌ను వివరణ కోరగా ఇటీవల బదిలీపై వచ్చానని, పరిశీలించి ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## క్రీడా ప్రాంగణానికి దారివ్వాలని రైతుల ధర్నా



చేగుంట అనంతసాగర్‌రోడ్డులో ధర్నా నిర్వహిస్తున్న చేగుంట,అనంతసాగర్ రైతులు


చేగుంట, జూన్14: క్రీడా ప్రాగణానికి దారి ఇవ్వాలని కోరుతూ చేగుంట, అనంతసాగర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు రహదారిపై శనివారం ధర్నా చేశారు. చేగుంట సమీపంలోని అనంతసాగర్ రోడ్డులో గల జీవికా పరిశ్రమ వారు క్రీడా ప్రహరీని నిర్మించారు. దీంతో క్రీడా ప్రాంగణానికి వెళ్లే వారికి రహదారి లేక ఇబ్బందులు పడుతు న్నారు. చేగుంట, అనంతసాగర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు రోడ్డుపై బైటాయించి ధర్నా, రస్తారోకో చెపట్టారు. చేగుంట పోలీసులు అక్కడికి చేరుకుని పరిశ్రమ యజమానులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

## పరిసరాలు శుభ్రంగా ఉండాలి

**మూత్రశాలలను పరిశీలించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ విజయభాస్కర్**

రామాయంపేట, జూన్ 14: బస్టాండులో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజనల్ మేనేజర్ విజయభాప్కర్ అన్నారు.శనివారం రామాయంపేట, చేగుంట మండల కేంద్రాలలోని బస్టాండులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.బస్టాండులో సమస్యలుంటే వెంటనే సంబంధిత డీఎంకు తెలియజేయాలని తెలిపారు.బస్టాండులో మూత్రశాలలు, షాపింగ్ కాంప్లెక్సు, కంట్రోలర్ కార్యాలయాలలో చెత్త లేకుండా ఉండాలన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటి కప్పుడు పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

## హైందవ ధర్మపరిరక్షణకు పాటుపడాలి



బోలో కృష్ణకు మెదక్ బజరంగ్‌దళ్ జిల్లా విద్యార్థి ప్రముఖ్‌గా నియమిస్తున్న దృశ్యం

పాపన్నపేట,జూన్ 14: హిందూ ధర్మం కోసం, హిందూ సమాజం కోసం ప్రతిఒక్క హిందువు పనిచేయాలని భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మల సత్యం జి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఏడుపాయల్లో మెదక్ జిల్లా స్థాయి విశ్వహిం దూ పరిషత్ బజరంగ్‌దళ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందులో భాగంగా పలువురి కార్యకర్తలకు నూతన బాధ్యతలు అప్పగించారు.పాపన్నపేట మండల ప్రఖండ బజరంగ్‌దళ్ ప్రముఖ్‌గా ఈదునూరి మల్లేశం మెదక్ జిల్లా బజరంగ్‌దళ్ విద్యార్థి ప్రముక్‌గా బోలకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మెదక్ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, విశ్వహిందూ పరిషత్ మెదక్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం, మెదక్ జిల్లా కార్యదర్శి నీలశ్యామ్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



శంకర్(ఫైల్

వెల్దుర్తి, జూన్ 14. ఒకరి దశదినకర్మకు వెళ్లి చెరువులో స్నానానికి దిగిన వ్యక్తి అందులోనే పడి మృతి చెందిన ఘటన మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మడ్గ నాగరాజు కొన్ని రోజుల క్రితం మృతి చెందాడు. శనివారం అతడి దశదినకర్మ చేశారు. కుటుంబసభ్యులు, బంధువులు అందరూ కలిసి స్థానిక చెరువులో స్నానానికి వెళ్లారు. మడ్గ శంకర్(45) చెరువులో స్నానానికి వెళ్లి, ప్రమాదవశాత్తు జేసీబీ గుంతలో పడిపోయాడు.

అతడి కోసం చెరువులో వెతకగా, ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు రామాయంపేట నుంచి ఫైర్ రెస్క్యూ టీం రప్పించి, వారి సాయంతో వెతకగా శంకర్ మృతదేహం లభించింది. శవ పంచనామా నిర్వహించిన పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బాధిత కుటుంబానికి కంఠారెడ్డి సాయం



నిజాంపేట, జూన్14: నిజాంపేటకు చెందిన ఖాజభాను అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి శనివారం పార్టీ గ్రామ అధ్యక్షుడు చల్మెటి నాగరాజు, యూత్ మండల అధ్యక్షుడు మావురం రాజు, మండల ఉపాధ్యక్షుడు రాములు, మాజీ వార్డు సభ్యుడు తిరుమల్‌గౌడ్ ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.

### రామాయంపేటలో..



రామాయంపేట, జూన్ 14: రామాయంపేటకు చెందిన టంకరి రాము(26) ముంబాయిలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని నాయకుడు చింతల రాములు ద్వారా శనివారం అందజేశారు.

### చిన్నశంకరంపేటలో..



చిన్నశంకరంపేట, జూన్14: మండలంలోని ఖాజాపూర్‌కు చెందిన వడ్ల రాములు అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి లీలాగ్రూప్ చైర్మన్ మోహన్ నాయక్ రూ.5వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.